క్లుప్తంగా

అప్పన్న క్యాలెండర్ విక్రయాలు



క్యాలెండర్లను భక్తులకు అందిస్తున్న ఏఈవో

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం రూపొందించిన 2025 క్యాలెండర్ల విక్రయాలను ప్రారంభించారు. స్వామివారి అవతారాలతో రూపొందించిన క్యాలెండర్ రూ.150, నిత్య నిజరూపాలతో ముద్రించిన క్యాలెండర్ రూ.30లకు విక్రయాలు జరిపారు. దక్షిణ రాజగోపురం ప్రాంగణంలో ఉన్న సేవా వివరాల కేంద్రం, శ్రీగోకులం వద్ద ఉన్న కేంద్రంలోను క్యాలెండర్లు అందుబాటులో ఉంటాయని ఏఈవో ఆనంద్‌కుమార్ తెలిపారు.

వేంకటాద్రిపై ప్రత్యేక పూజలు



పెందుర్తి: వేంకటాద్రిపై జరుగుతున్న ధనుర్మాసోత్సవాల్లో భాగంగా 15వ రోజు సోమవారం వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్తి రామానుజాచార్యుల ఆధ్వర్యంలో వేకువజామున హారతి, సేవాకాలం, శాత్తుమురై, తిరుప్పావై పారాయణం, తీర్థగోష్ఠి జరిపారు. 15వ పాశుర విన్నపం చేశారు. అనంతరం ఈవో నీలిమ పర్యవేక్షణలో వందలాది మంది భక్తులకు అన్న ప్రసాద వితరణ చేపట్టారు.

టెన్త్ స్టడీ మెటీరియల్ పంపిణీ



విద్యార్థులతో లయన్స్‌క్లబ్ సభ్యులు, టీచర్లు

పరవాడ: విశాఖ స్టీల్ సిటీ లయన్స్ క్లబ్ అందించిన స్టడీమెటీరియల్‌ను పదో తరగతి విద్యార్థులు సద్వినియోగం చేసుకుని, పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని క్లబ్ అధ్యక్షులు పీకేఎం లక్ష్మి కోరారు. దేశపాత్రునిపాలెం జెడ్పీ స్కూల్ నుంచి ఈ విద్యా సంవత్సరంలో టెన్త్ పరీక్షలకు హాజరుకానున్న విద్యార్థులకు లయన్స్‌క్లబ్ ద్వారా స్టడీ మెటీరియల్‌ను సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కార్యదర్శి బి.సత్యప్రకాష్, క్లబ్ ప్రతినిధులు ఆర్.రామచంద్రరావు, ఎం.జగన్నాథరావు, పాఠశాల హెచ్ఎం ఆర్.సుజాత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అన్నదానానికి విరాళం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి హైదరాబాద్‌లోని ఇబ్రహీంపట్నంకు చెందిన డి.శ్రీనివాసరావు అనే దాత రూ.లక్ష విరాళాన్ని ఇచ్చారు. కుటుంబ సమేతంగా సింహగిరికి వచ్చిన దాత విరాళాన్ని పీఆర్వో కార్యాలయంలో అందించారు. దేవస్థానం తరఫున దాతకు బాండ్ ఇచ్చి, స్వామివారి దర్శనం అనంతరం ప్రసాదాన్ని, శేషవస్త్రాన్ని అందజేశారు.


అప్పన్న సన్నిధిలో బాక్సింగ్ మాజీ కోచ్ చిరంజీవి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని అంతర్జాతీయ బాక్సింగ్ మాజీ కోచ్ ఇ.చిరంజీవి, అతని కుమారుడు అంతర్జాతీయ బాక్సర్ రంజిత్ కుటుంబసమేతంగా సోమవారం దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. వాళ్ల పేరిట అర్చకులు స్వామికి అంతరాలయంలో పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అనంతరం ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలను ఏఈవో ఆనంద్‌కుమార్ అందించారు.

ట్రాక్టర్ డ్రైవర్ అరెస్ట్

సబ్బవరం: మండలంలోని అమ్ములపాలెం జంక్షన్ వద్ద ఆదివారం రాత్రి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టి టైలర్ మృతికి కారణమైన ట్రాక్టర్ డ్రైవర్‌ను సోమవారం అరెస్టు చేసి, ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు సీఐ పిన్నింటి రమణ తెలిపారు. సీఐ తెలిపిన వివరాలు. గవరవారి కొంపలకు చెందిన బలిరెడ్డి శేషుబాబు ఆదివారం రాత్రి ట్రాక్టర్‌పై వెళ్తూ, భార్య మంగమ్మతో కలిసి బైక్‌పై వస్తున్న కోసూరి సూరిబాబును ఢీకొన్న విషయం తెలిసిందే. సూరిబాబు అక్కడికక్కడే మృతిచెందగా, గాయపడ్డ భార్య ప్రస్తుతం కోలుకుంటోందని సీఐ పేర్కొన్నారు.

జీవితంపై ఎన్నో ఆశలు.. కుటుంబ బరువు బాధ్యతలు.. స్నేహితులతో మధురానుభూతులు.. ఇలా అన్నీ నీటిలోనే సమాధి అవుతున్నాయి. సరదాకు ఈతకు వెళితే అక్కడే జీవితం ముగిసిపోతోంది. కుటుంబ సభ్యులకు.. అంత వరకూ సరదాగా గడిపిన స్నేహితులకు కన్నీరే మిగులుతోంది. మేహాద్రిగెడ్డ, నల్లక్వారీ మడుగులు మింగిన ప్రాణాలు వందకుపైనే..! ఈత సరదా, లోతుపై అవగాహనా లేక చాలా మంది జీవితాలు అర్ధంతరంగా ముగుస్తున్నాయి. వారి కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపుతున్నాయి.



మేహాద్రిగెడ్డ రిజర్వాయర్

ఆరేళ్లలో 'మేహాద్రి'మరణాలు	
సంవత్సరం	మరణాలు
2019	07
2020	04
2021	10
2022	03
2023	05
2024	06

ఈత.. గుండెకోత





ప్రమాదకర పెందుర్తి నల్లక్వారీ మడుగు



మేహాద్రి రిజర్వాయర్‌లో ప్రమాదకర ఊబి ఉన్న ప్రాంతం

పెందుర్తి:

మేహాద్రి గెడ్డ రిజర్వాయర్‌లో ఈత సరదాతో అత్యధిక ప్రమాదాలు చోటు చేసుకోగా, పెందుర్తి సమీపంలోని నల్లక్వారీ మడుగు అనేక మంది ప్రాణాలు తీసుకుంది. ఇటీవలకాలంలో మేహాద్రి రిజర్వాయర్‌కు ఈతకు వెళ్లిన పలువురు యువకులు ప్రాణాలు కోల్పోవడం విషాదకరం. తాజాగా క్రిస్మస్ రోజు పెందుర్తి నల్లక్వారీ మడుగులో పడి అర్జున్ ప్రధాన్ అనే విద్యార్థి మృతి చెందడం స్థానికంగా విషాదాన్ని నింపింది. అయినప్పటికీ జలాశయాల్లో ఈతకు దిగేవారిని నియంత్రించడంలో అధికార యంత్రాంగం విఫలమవుతూనే ఉంది.

మృత్యు గెడ్డ మేహాద్రి

నగర పరిధిలో ఉన్న ఎక్కువ నీటి మట్టం కలిగిన రిజర్వాయర్ మేహాద్రి రిజర్వాయర్. పిక్నిక్‌ల సమయం కావడంతో రోజూ వందలాది మంది రిజర్వాయర్ సందర్శనకు వస్తుంటారు. మందుబాబుల పార్టీలకు కొదవేలేదు. అయితే సరదాగా ఈతకు వచ్చిన వారికి, పూటుగా మద్యం సేవించిన వారికి రిజర్వాయర్ లోతు గురించి అవగాహన లేని పరిస్థితి. దీంతో ఈత కోసం గెడ్డలోకి దిగి ప్రమాదాలకు గురవుతున్నారు. ఊబిలో చిక్కుకుని ప్రాణాలు కోల్పోతున్నారు. ఇక్కడ ఈత నిషేధం అని ఉన్న హెచ్చరిక బోర్డులను కూడా లెక్క చేయక దిగుతున్నారు. ప్రాణాలు పోగొట్టుకున్నారు. అందుబాటులో ఉన్న లెక్కల మేరకు ఆరేళ్ల కాలంలో మేహాద్రిలో ప్రమాదాలకు గురై 35 మంది మృత్యువాతపడ్డారు.

కొరవడిన నిఘా!

మృత్యు గెడ్డ మేహాద్రిలో ఏటా పదుల సంఖ్యలో ప్రాణాలు హరించుకుపోతున్నాయి. ముఖ్యంగా పిక్నిక్‌ల సీజన్, సంక్రాంతి, వేసవి సెలవుల సమయంలో ఇక్కడ ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి. మేహాద్రి గేటు సమీపంలో ఇది నిషేధిత ప్రాంతం అనే హెచ్చరిక బోర్డులు తప్ప, దాన్ని పట్టించుకోని వారిని నియంత్రించేందుకు ఎవరూ ఉండరు. అక్కడ ఉన్న రిజర్వాయర్ సిబ్బంది వారించినా కొందరు ఆకతాయిలు వారితో వాదనలకు దిగి మరీ నిషేధిత ప్రాంతంలో ఈతకు ఉపక్రమిస్తున్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు హడావుడి చేసే ఉన్నతాధికారులు ఆ తర్వాత కనిపించని పరిస్థితి. పోలీసులతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామనే మాటలు తప్ప, చేతలు లేవని పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి ఈ పిక్నిక్ సీజన్లో ప్రమాదకర ప్రదేశాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ప్రత్యేక చర్యలు తీసుకుంటాం



పండగ సెలవులు, పిక్నిక్‌ల నేపథ్యంలో తల్లిదండ్రులు పిల్లల పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలి. రిజర్వాయర్లలో స్నానాల కోసం దిగే సాహసాలు మంచిది కాదు. మేహాద్రి రిజర్వాయర్ వద్ద ప్రత్యేకంగా మా సిబ్బందిని గస్తీ ఉంచుతున్నాం. రిజర్వాయర్ల వద్ద మందు పార్టీలు చేసుకునే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

– కె.వి.సతీష్‌కుమార్, సీఐ, పెందుర్తి

నల్లక్వారీ మింగిన ప్రాణాలెన్నో..

పెందుర్తి ప్రాంతంలో మరో అత్యంత ప్రమాదకరమైన నీటి మడుగు నల్లక్వారీ మడుగు. పదునైన రాతి శిలలు, అడుగుకో ఊబితో ఉన్న ఈ మడుగులో ఆరేళ్ల క్రితం ఐదుగురు విద్యార్థులు ఈతకు వెళ్లి మరణించడం పెను విషాదం. అంతకు ముందు ఐదుగురు మేకల కాపరులు సైతం ఇక్కడ ఒకేసారి ప్రాణాలు విడిచారు. ఈ మడుగులో ఇప్పటివరకూ సుమారు 80 మంది ప్రాణాలు పోగొట్టుకున్నారు. వీటితో పాటు చెరువులు, చిన్నపాటి గెడ్డలు కూడా ప్రమాదాలకు నిలయాలుగా మారుతున్నాయి. ఆదమరిస్తే కన్న కలలు నీటి పాలు, కన్నవారికి కడుపు కోతే మిగులుతుంది.



ఇటీవల నల్లక్వారీ మడుగులో మరణించిన అర్జున్ ప్రధాన్ మృతదేహం(ఫైల్)

రెవెన్యూ సదస్సుల్లో వినతుల వెల్లువ

- చింతగట్లలో భూ కబ్జాలపై ఫిర్యాదులు



చింతగట్ల రెవెన్యూ సదస్సులో భూకబ్జాలపై తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న సర్పంచ్ గనిశెట్టి వెంకటలక్ష్మి

పెందుర్తి: మండలంలోని చింతగట్ల పంచాయతీలో సోమవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు వినతులు వెల్లువెత్తాయి. మొత్తం 67 అర్జీలు రాగా అందులో 14 మ్యుటేషన్ కోసం, 16 ఎఫ్–లైన్ కోసం, 13 భూ ఆక్రమణలపై, ఆరు ఇతర సమస్యలపై దరఖాస్తులు/ ఫిర్యాదులు అందాయి. ఈ సందర్భంగా తహసీల్దార్ కె.ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసమే ఈ సదస్సులను ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. ప్రజలు అందించిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి.. సమగ్ర విచారణ జరిపి, పరిష్కారం చూపుతామన్నారు. భూ ఆక్రమణలపై వచ్చిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించి, వాస్తవంగా ఆక్రమణలు ఉంటే నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు. సర్పంచ్ గనిశెట్టి వెంకటలక్ష్మి, ఎంపీటీసీ సభ్యుడు నందవరపు అప్పలరాజు, స్థానిక నేతలు గనిశెట్టి కనకరాజు, దాసరి రమణ, చిన్నారావు, నరసింగరావు, అధికారులు పాల్గొన్నారు.

అర్జీల్లో ప్రధానమైనవి కొన్ని..

- 2020లో చింతగట్ల–పెదగాడి రోడ్డు వేసిన సమయంలో చింతగట్ల సర్వే నెం.14/1ఈ, 1డి, 1సి, 14/2డి, 13లలో ఉన్న జిరాయితీ భూమిని రోడ్డు కోసం ఇచ్చామని.. అప్పట్లో రెవెన్యూ అధికారులు సర్వే నెం.16లో తాము కోల్పోయిన భూమికి బదులుగా కేటాయించారని రైతులు అధికారులకు చెప్పారు. అయితే ఎల్‌పీసీలు ఇవ్వకపోవడంతో తాము ఇంటి నిర్మాణం చేపడుతుంటే రెవెన్యూ పరమైన సమస్యలు ఎదురవుతున్నాయని వాపోయారు. తమకు ఎల్‌పీసీలు ఇవ్వాల్సిందిగా తహసీల్దార్‌ను కోరుతూ వినతిపత్రం సమర్పించారు.
- చింతగట్ల సర్వే నెంబర్లు 83, 84లలో ఇప్పిలివానిపాలేనికి చెందిన ఇప్పిలి చిన్నారావు 3 సెంట్లు ఆక్రమించి షెడ్ నిర్మాణం చేపట్టాడని దానిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు అందింది.
- చింతగట్ల రెవెన్యూ సర్వే నెంబర్ 84లో దాసరి రమణ అనే వ్యక్తి 10 సెంట్ల ప్రభుత్వ భూమి ఆక్రమించి భారీ నిర్మాణం చేపట్టాడని ఫిర్యాదు వచ్చింది.
- సర్వే నెంబర్ 83, 84లో సుమారు 8 సెంట్లును మాడిన రాజు, మాడిన రమణ, మాడిన హరీష్ ఆక్రమించుకుని ఇళ్లు నిర్మించారని ఫిర్యాదు చేశారు.
- సర్వే నెంబర్ 73లో మండల పరిషత్ ప్రభుత్వ పాఠశాల స్థలాన్ని ఆక్రమించిన మాడిన రాజు, మాడిన హరీష్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు.
- సర్వే నెం.56, 57లలో చీపురపల్లి నరసింగరావు భూ కబ్జాలకు పాల్పడ్డాడని పిర్యాదు అందింది.
- సర్వే నెంబర్ 15/15, 16లలో గనిశెట్టి కనకారావు ప్రభుత్వ భూమిని ఆక్రమించాడని పలువురు వ్యక్తులు అధికారులకు ఫిర్యాదు చేశారు.



రెవెన్యూ సదస్సులో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల

పరవాడ: ప్రభుత్వ భూములను ఆక్రమించిన వారు ఎంతటి వారైనా, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులను ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు ఆదేశించారు. పరవాడలో సోమవారం నిర్వహించిన ముగింపు రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ భూములు, చెరువులు, గెడ్డలు, కాలువలను ఆక్రమించిన వారిని ఉపేక్షించవద్దన్నారు. ఇలాంటి వాటిపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో తనకు నివేదిక అందించాలని ఆదేశించారు. ప్రభుత్వ భూముల ఆక్రమణలపై తనిఖీలు జరిపి, వారం పది రోజుల్లో సమగ్ర నివేదిక అందించాలన్నారు. రెవెన్యూ సదస్సులో ప్రజల నుంచి అందిన వినతులను తక్షణమే పరిష్కరించి, ప్రజలకు అండగా నిలవాలని సూచించారు. పరవాడ సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు కోరిక మేరకు స్థానిక రజకుల కోసం సీఎస్సార్ నిధుల నుంచి దోబీ ఘాట్ నిర్మాణంతో పాటు గ్రామంలో సోలార్ విద్యుత్ దీపాల ఏర్పాటు, పారిశుద్ధ్య నిర్వహణ కోసం మినీ వ్యాను మంజూరుకు భరోసానిచ్చారు. హుద్‌హుద్ తుపానులో ఇళ్లను కోల్పోయిన 13 మంది బాధితులకు ఇళ్ల పట్టాల మంజూరుకు తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. రెవెన్యూ సదస్సులో ప్రజల నుంచి 37 అర్జీలు అధికారులకు అందాయి. తహసీల్దార్ ఎస్వీ అంబేడ్కర్, ఎంపీడీవో శ్యామ్ సుందర్, ఎంపీటీసీ పైల శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ చుక్క రామునాయుడు పాల్గొన్నారు.



గుల్లేపల్లిలో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ చిన్నికృష్ణ

సబ్బవరం: భూ సమస్యల పరిష్కారానికి రైతులు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ బి.చిన్నికృష్ణ అన్నారు. మండలంలోని గుల్లేపల్లి, మొగలిపురం గ్రామాల్లో సోమవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో ఆయన పాల్గొని, రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. గుల్లేపల్లి సదస్సుకు 8, మొగలిపురం సదస్సుకు 5 అర్జీలు వచ్చినట్లు వెల్లడించారు. వీటిని పరిశీలించి, త్వరితగతిన పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమాల్లో మండల సర్వేయర్ ఎల్.అప్పారావు, రీసర్వే డీటీ గణపతిరావు, మాజీ ఎంపీపీ గండి దేముడుబాబు, ఎంపీటీసీ గొర్లి కనకరాజు, గ్రామ పెద్దలు బండారు శ్రీను, బోను గంగునాయుడు, గజ్జి దేముడుబాబు పాల్గొన్నారు.

అబ్బురపరిచిన వైజ్ఞానిక ప్రదర్శన



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో అధికారులు, ఉపాధ్యాయులు

పరవాడ: స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన మండల స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన అబ్బురపరిచింది. మండలంలోని పలు పాఠశాలల విద్యార్థులు తమ నైపుణ్యాలకు పదునుపెట్టి రూపొందించిన నమూనాలను ఇక్కడ ప్రదర్శించారు. వాటిని చూసేందుకు వచ్చిన విద్యార్థులు, తల్లిదండ్రులు, అధికారులకు ఆ విశేషాలను వివరిస్తూ ఆకట్టుకున్నారు. ఈ ఎగ్జిబిషన్‌ను మండల విద్యాశాఖాధికారులు దివాకరరావు, సాయిశైలజలు ప్రారంభించారు. న్యాయ నిర్ణేతలుగా పెద్దినాయుడు, కనకారావులు వ్యవహరించారు. సైన్స్ ఫెయిర్‌లో భాగంగా వ్యక్తిగత విభాగంలో పెదముషిడివాడ జెడ్పీ హైస్కూల్‌కు చెందిన జి.మైథిలి(ఆటోమేటిక్ ఫైర్ డిటెక్షన్ అలారమ్), ధర్మారాయుడుపేట జెడ్పీ హైస్కూల్‌కు చెందిన సుహానాబేగం(వుమన్ సేఫ్టీ బ్యాంగిల్), పరవాడ బాలికోన్నత పాఠశాలకు చెందిన లిఖిత(వాటర్ ప్యూరిఫికేషన్) నమూనాలు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. గ్రూప్ విభాగంలో ధర్మారాయుడుపేట హైస్కూల్‌కు చెందిన కె.కుసుమ, ప్రేమ్ అపర్ణ(డ్రంక్ అండ్ డ్రైవ్ నిరోధక ఆటోమేటిక్ ఇంజిన్ లాకింగ్ సిస్టమ్), పరవాడ బాలికోన్నత పాఠశాలకు చెందిన జి.జాహ్నవి, దుర్గాపూజిత నమూనాలు తొలి రెండు స్థానాల్లో నిలిచాయి. ఉపాధ్యాయ విభాగంలో పరవాడ బాలికోన్నత పాఠశాల సైన్స్ ఉపాధ్యాయిని ఎస్.ఎన్.జ్యోతి రూపొందించిన టాక్సిక్ గ్యాస్ న్యూట్రలైజేషన్ నమూనా ఎంపికయింది.



సైన్స్ ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న అధికారులు



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపీపీ బోకం సూర్యకుమారి తదితరులు

వైజ్ఞానిక ప్రదర్శనలతో విద్యార్థుల్లో సృజనాత్మకత

సబ్బవరం: వైజ్ఞానిక ప్రదర్శనలతో విద్యార్థుల్లో సృజనాత్మకత మరింత పెరుగుతుందని ఎంపీపీ బోకం సూర్యకుమారి అన్నారు. మండలంలోని సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన మండల స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనను ఆమె ప్రారంభించారు. ఇలాంటి వైజ్ఞానిక ప్రదర్శనలను పాఠశాల స్థాయి నుంచి ప్రోత్సహించడం ద్వారా విద్యార్థుల్లో నూతన ఆవిష్కరణపై మరింత ఆసక్తి పెరుగుతుందన్నారు. పలు పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థుల ఆవిష్కరణలను పరిశీలించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవోలు ఎస్.లక్ష్మణరావు, ఎంజే రవీంద్రబాబు, ఎంపీటీసీ బైలపూడి దేముడుబాబు, హెచ్ఎం పి.రాధాకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అమిత్‌షాను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలి



నిరసన కార్యక్రమంలో సీపీఎం నాయకులు

పరవాడ: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై రాజ్యసభలో అవమానకర వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా తక్షణమే రాజీనామా చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. పరవాడ సినిమా హాలు కూడలిలో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా వ్యాఖ్యలకు నిరసనగా సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గనిశెట్టి మాట్లాడుతూ అంబేడ్కర్‌పై కేంద్ర హోం మంత్రి స్థానంలో ఉన్న అమిత్‌షా చేసిన అవమానకర వ్యాఖ్యలపై దేశ వ్యాప్తంగా ఆగ్రహావేశాలు పెల్లుబుకుతున్నాయన్నారు. అమిత్‌సా వ్యాఖ్యలను ప్రధాని మోదీ సమర్థించడం దుర్మార్గమన్నారు. వీరికి రాజ్యాంగంపై, అంబేడ్కర్‌పై గౌరవం లేదని ఆక్షేపించారు. ప్రధాని మోదీకి చిత్తశుద్ధి ఉంటే అంబేడ్కర్‌ను అవమానపర్చిన అమిత్‌షాను కేంద్ర మంత్రి వర్గం నుంచి వెంటనే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. అమిత్‌షా, మోదీలు దేశ సంపదను అంబానీ, అదానీలకు దోచిపెడుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో పార్టీ స్థానిక నాయకులు వి.వి.రమణ, జి.అప్పారావు, రమణ పాల్గొన్నారు.

రెవెన్యూ గ్రామంగా గుర్తించాలని వినతి



ఎమ్మెల్యే పంచకర్లకు వినతిపత్రం అందిస్తున్న ఉప సర్పంచ్ సన్యాసిరావు

పరవాడ: ప్రజలకు రెవెన్యూ పరమైన ఇబ్బందులను తొలగించడానికి వీలుగా వెన్నలపాలెం గ్రామాన్ని రెవెన్యూ గ్రామంగా గుర్తించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని గ్రామ ఉపసర్పంచ్, వైఎస్సార్‌సీపీ మండల జేసీఎస్ కన్వీనర్ వెన్నల సన్యాసిరావు కోరారు. వెన్నలపాలెం గ్రామ పంచాయతీలో 3 వేల మంది జనాభాతో పాటు 850 గృహాలు, 486 మంది రైతులు ఉన్నారు. గ్రామాన్ని రెవెన్యూ గ్రామంగా గుర్తించని కారణంగా వివిధ పనుల కోసం పరవాడ, రావాడ, ఈ బోనంగి, స్వయం భూరం సచివాలయాలపై ఆధారపడాల్సి వస్తోంది. ఫలితంగా ప్రజలు వ్యయ ప్రయాసలకు లోనవుతున్నారు. రైతులు తమ సమస్యల పరిష్కారం కోసం మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయానికి వెళ్లినా.. వీఆర్వోలు అందుబాటులో లేక పనులు జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల ఇబ్బందులను గుర్తించి ప్రభుత్వం చేపట్టే శాశ్వత భూసర్వే కార్యక్రమంలో భాగంగా వెన్నలపాలెంను రెవెన్యూ గ్రామంగా నిర్ణయించి, రైతులను ఆదుకోవాలని వినతిపత్రంలో కోరారు.

'కౌశల్-2024'లో చైత్రవర్షిణి ప్రతిభ



ప్రథమ బహుమతి అందుకుంటున్న చైత్ర వర్షిణి

సింహాచలం: విజయవాడలో సోమవారం జరిగిన కౌశల్–2024 రాష్ట్ర స్థాయి సైన్స్ పోటీల్లో అడవివరం జెడ్పీ హైస్కూల్ విద్యార్థి చైత్ర వర్షిణి ప్రతిభ కనబరించింది. బయోడైవర్సిటీ అండ్ సాయిల్ హెల్త్‌పై రూపొందించిన నమూనా ప్రథమ స్థానంలో నిలిచినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఇమంది పైడిరాజు మీడియాకు తెలిపారు. విజయవాడలో జరిగిన కార్యక్రమంలో అతిథుల చేతుల మీదుగా చైత్రవర్షిణి అవార్డు అందుకున్నట్లు పేర్కొన్నారు.

కంప్యూటర్ విద్యపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న తరుణ్

పెందుర్తి: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 'ఇంట్రో టు కంప్యూటింగ్' అంశంపై సోమవారం వర్క్‌షాప్ నిర్వహించారు. కళాశాలలోని కంప్యూటర్ సైన్స్ విద్యార్థులకు అమెరికాలోని జార్జియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ విద్యార్థి తరుణ్ పువ్వల కంప్యూటర్ హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ అంశాలపై ప్రస్తుత పరిజ్ఞానాన్ని వివరించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై సందేహాలను నివృత్తి చేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.చంద్రశేఖర్ పర్యవేక్షణలో జరిగిన వర్క్‌షాప్‌లో అధ్యాపకులు పాల్గొన్నారు.

గంజాయి కేసులో వ్యక్తికి రిమాండ్

సబ్బవరం: గంజాయి కేసులో పరారైన వ్యక్తిని సోమవారం అరెస్టు చేసినట్లు సీఐ పిన్నింటి రమణ తెలిపారు. 2022లో సబ్బవరం మీదుగా గంజాయి తరలిస్తూ 8వ నిందితుడైన జి.మాడుగుల మండలం జీలిగుగొయ్య గ్రామానికి చెందిన బంటూరి మోదేశ్వరరావు(48) అలియాస్ మోజేష్ తప్పించుకున్నాడు. తన అన్న రాంబాబుతో కలిసి గ్రామంలో గంజాయి పండిస్తుండేవాడు. మోజేష్ అన్న రాంబాబును, గంజాయి కొనుగోలు చేసిన సాలాపు వరహాలబాబును ఇదివరకే అరెస్టు చేశారు. తప్పించుకున్న మోజేష్ కూడా దొరకడంతో అరెస్ట్ చేసి, కోర్టుకు తరలించగా రిమాండ్ విధించినట్లు సీఐ వెల్లడించారు.